క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్‌లో జ్ఞాన దివ్యకు పతకాలు



మంగళగిరి: ఉత్తరా ఖండ్ రాష్ట్రం డెహ్రా డన్‌లో జరుగుతున్న ఏషియన్ జూనియర్ క్లాసిక్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లో భారత దేశం తరఫున పాల్గొన్న నాగం జ్ఞాన దివ్య ప్లస్ 84 కేజీల విభాగంలో రెండు సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని గురువారం తెలిపారు. తెనాలికి చెందిన జ్ఞాన దివ్య పతకాలు సాధించడంపై సౌత్ ఇండియా, రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఎన్.వంశీకృష్ణ అభినందించినట్లు పేర్కొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

తాడికొండ: తాడికొండ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.సమతా వాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

12న ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు



మంగళగిరి, మంగళగిరి టౌన్: బుద్ధ జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న మంగళగిరి ఆటోనగర్‌లోని రాయల్ కన్వెన్షన్ హాలులో బుద్ధ పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ ధనుంజయరావు తెలిపారు. గురువారం రాయల్ బంకెట్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో సంబంధిత గోడ పత్రికలను ఆవిష్కరించారు. బుద్ధ పూర్ణిమ సందర్భంగా ప్రముఖ సాహితీ విమర్శకులు అబ్దుల్ రజా హుస్సేన్ రచించిన 'కళలసిరి మంగళగిరి' పుస్తకావిష్కరణ జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బుద్ధ విహార వ్యవస్థాపకులు రేఖా కృష్ణార్జునరావు, మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు, గౌరవ అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, విశ్వశాంతి కళాపరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు, పిరమిడ్ మాస్టర్ ఆకురాతి శంకరరావు, ప్రజానాట్యమండలి కళాకారులు కంచర్ల కాశయ్య, సంధుబట్ల భూపతి, అల్లక తాతారావు పాల్గొన్నారు.

షైన్ ఆనందశరణాలయానికి గుర్తింపు



చినకాకాని(మంగళగిరి): నగర పరిధిలోని చినకాకానిలోని షైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న షైన్ ఆనంద శరణాలయానికి బాల్య సంక్షేమం, దిద్దుబాటు సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ గుర్తింపు పత్రం అందజేసింది. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా పత్రం అందుకున్న ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్ మాట్లాడుతూ.. శరణాలయంలో 50 మంది బాలురు, 30 మంది బాలికలకు అనుమతిస్తూ ప్రభుత్వం గుర్తింపు పత్రం అందజేసిందన్నారు. బాల బాలికలకు భవిష్యత్తులో కూడా శరణాలయంలో మంచి విశిష్టమైన సేవలు అందించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డీపీఓ సౌందర్య పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం

తాడికొండ: తుళ్లూరు గ్రంథాలయంలో 12 రోజులుగా జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపుతోందని గ్రంథాలయాధికారి గిరిధర్ కుమార్ అన్నారు. ఈ శిబిరంలో భాగంగా గురువారం చిన్నారులకు పేపర్ క్రాఫ్ట్ తయారీపై మెలకువలు నేర్పించారు. పేపరుతో బొమ్మలు తయారు చేయడంలో చిన్నారులు ఆశక్తిగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పలువురు గ్రామస్తులు, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

పీఎంజేఏవై సర్వే 80శాతం పూర్తి

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో పీఎంజేఏవై సర్వే 80శాతం పూర్తయినట్లు వైద్యాధికారి యానీగ్రేస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి రేషన్ కార్డు దారుల ఆరోగ్య పరమైన వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారని అన్నారు. పీఎంజేఏవై కార్డులు కూడా అందిస్తామని.. దీంతో ఏ రాష్ట్రంలోనైనా ఆరోగ్య పరమైన చికిత్స చేయించుకునేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. రూ.5 లక్షల వరకు ప్రభుత్వపరమైన సహాయం కార్డు ద్వారా అందుతుందని చెప్పారు.

నేరాలు, చోరీల నియంత్రణకు నిఘానేత్రాలు

- నేరాల నియంత్రణకు సహకరించాలంటున్న పోలీసులు
- చిన్న వీధులతో సహా భద్రత పెంపు



స్క్రీన్‌పై సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న రూరల్ ఎస్‌ఐ వెంకట్

మంగళగిరి: నేరాలు, చోరీలు.. మహిళలు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఆకతాయిల చేష్టలకు అడ్డుకట్ట వేయడంతో పాటు నేరస్తులను త్వరితగతిన పట్టుకోవచ్చని భావించిన పోలీసు అధికారులు నిఘా నేత్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జాతీయ రహదారిపై పలు ప్రాంతాలు, విలీన గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేసి భద్రతను పెంచారు. నార్త్ జోన్ సబ్ డివిజన్ పరిధిలోని మంగళగిరి, మంగళగిరి రూరల్, తాడేపల్లి రూరల్, దుగ్గిరాల, పెదకాకాని మండలాల్లో నిఘా నేత్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. మంగళగిరి పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు అధికంగా జన సంచారం ఉన్న ప్రాంతాలు, ప్రజలు వాకింగ్ చేసే ఏకో పార్కు ప్రాంతంలో నూతనంగా వీటిని ఏర్పాటు చేశారు.

> వేసవిలో ప్రజలు ఊర్లకు వెళ్లినప్పుడు తాళాలు వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని దొంగలు పేట్రేగిపోతున్నారు. దీంతో వారి ఆగడాలను అరికట్టేందుకు లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం.. రాత్రి సమయంలో ఆ ప్రాంతాలలో గస్తీ ఏర్పాటు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. నేరాలు, చోరీల నియంత్రణకు అధికారలు పాటుపడుతున్నారు.

సమాచారం తెలుసుకొనేందుకు..

నేరాల నియంత్రణకు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొనేందుకు పోలీసులు నిఘా నేత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇకపై నిఘా నేత్రాల వలయంలో నార్త్ సబ్ డివిజన్ పరిధిలోని పట్టణాలు, గ్రామాలు ఉండనున్నాయి. మేరకు పోలీసు అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగించుకుని శక్తివంతమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. పలు గ్రామాల్లో దాతల సహకారంతో ప్రధాన కూడళ్లల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిఘా నేత్రాలను ఏర్పాటు చేయడంతో డ్రోన్‌ల సహకారంతోనే నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల వినియోగంతో నిందితులను గుర్తించడం సులభతరమని అధికారులు చెబుతున్నారు. నగరంలో ఇప్పటికే కాజ టోల్‌గేట్, ఎస్‌ఆర్‌ఐ జంక్షన్, ఆటో నగర్, పాతబస్టాండ్ సెంటర్, కొత్త బస్టాండ్ సెంటర్, ఎంపీడీవో కార్యాలయం ఎదుట, మిద్దె సెంటర్, రాజీవ్ సెంటర్, ఉండవల్లి సెంటర్, తాడేపల్లి జాతీయ రహదారి వెంట, ఆత్మకూరు జాతీయ రహదారులతో పలు ప్రాంతాలలో ఈ నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు.

చర్యలు తీసుకుంటున్నాం..



నార్త్ జోన్ పరిధిలోని అన్ని ఏరియాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాము. చోరీలు, నేర నియంత్రణలో సీసీ కెమెరాల ఉపయోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వీటి ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యా సంస్థలు, యువజన సంఘాలు ముందుకు రావాలి. నేర నియంత్రణకు ఇవి ఎంతో ఉపయోగపడతాయి. ఆయా సెంటర్‌లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పర్యవేక్షించి నేర నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.

మురళీకృష్ణ, నార్త్ జోన్ డీఎస్పీ



ఏకో పార్కులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

ప్రజా కాపునాడు సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేస్తున్న అంజిబాబు

తాడేపల్లి రూరల్: ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ కమిటీని గురువారం తాడేపల్లిలోని సంఘ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సంఘం రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటుచేశామన్నారు. తాడేపల్లి పట్టణ అధ్యక్షులుగా పులేపు భాస్కరరావు, యూత్ అధ్యక్షుడిగా నక్క నవీన్‌రాజు, యూత్ సెక్రటరీగా పూడి రమణ.. ట్రెజరర్‌గా తాడికొండ నాగేశ్వరరావు.. యూత్ ప్రచార కార్యదర్శిగా అడపా నరేష్.. యూత్ జాయింట్ సెక్రటరీగా అల్లు సాయి చక్రపాణి ఎన్నికయ్యారని తెలిపారు. జాయింట్ ప్రచార కార్యదర్శిగా కేసురెడ్డి మురళీకృష్ణ.. జాయింట్ సెక్రటరీగా గాజుల వీరకృష్ణ.. తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షులుగా వలివేటి రమేష్ కుమార్.. కార్యదర్శిగా కొత్తూరు వెంకట మోహనరావు, యూత్ జాయింట్ సెక్రటరీగా వీరిశెట్టి వెంకటేశ్వరరావు ఎన్నుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో తోట కొండలరావు, కొరసాల నాగమల్లేశ్వరరావు, తగరం విజయ్ సాలిపల్లి దుర్గారావు, గద్దం రమేష్, చెన్నుపల్లి వెంకట కృష్ణారావు, పత్రిరిపల్లి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతులు చలపతిరావు, దావీదులు

తాడేపల్లి రూరల్: పేదలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడిన పేదల పక్షపాతులు చలపతిరావు, దావీదులు అని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అన్నారు. ప్రాతూరులో గురువారం అమరజీవులు డోకిపర్తి చలపతిరావు, చొక్కా దావీదుల 28వ వర్ధంతి కార్యక్రమాన్ని గ్రామ కార్యదర్శి డోకిపర్తి రాజేంద్రబాబు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణ నాయకులతో కలసి చలపతిరావు, దావీదుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చలపతిరావు, దావీదుల మరణం ప్రాతూరు గ్రామానితో పాటు గుండిమెడ, మెల్లెంపూడి గ్రామాల పార్టీ అభివృద్ధికి తీరని లోటు అని అన్నారు. సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ.. చలపతిరావు గ్రామ సర్పంచ్‌గా, సీపీఎం నాయకుడుగా ఈ ప్రాంత పేదల హృదయాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యలు, స్థానికం ఇసుక క్వారీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చలపతిరావు, దావీదులు పని చేశారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు కంచర్ల జేమ్స్, బత్తుల సంసోను, దాసరి సురేష్, బుర్రా రాజు, మిరియాల కోటేశ్వరరావు, చొక్కా మరియదాసు, గుడిసె శేఖర్, గుడిసె రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ



స్కేటింగ్‌లో సిల్వర్ మెడల్స్ అందుకుంటున్న తన్మయి నాగదుర్గ

మంగళగిరి టౌన్: ఢిల్లీలో ఏప్రిల్ 30 నుంచి మే 5వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన నేషనల్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో తన్మయి నాగదుర్గ ప్రతిభ చాటిందని నిర్మల స్కూల్ యాజమాన్యం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో అండర్ 11 బాలికల విభాగంలో రాష్ట్రం తరుపున నవులూరుకు చెందిన తన్మయి నాగదుర్గ 1500 మీటర్ల రోడ్డు రేస్‌లో సిల్వర్ మెడల్, 500 మీటర్ల రింక్ రేస్‌లో సిల్వర్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. తన్మయి మంగళగిరి నిర్మల సీబీఎస్ఈ స్కూల్‌లో 5వ తరగతి చదువుతోందని తెలిపారు. జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించి విజేతగా నిలిచిన బాలికను స్కూల్ యాజమాన్యం, స్కేటింగ్ కోచ్ ఎస్‌కే ఖాజా, ఫిట్‌నెస్ కోచ్ సుధాకర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

పెదకాకాని: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాల ఆర్థోడాంటిక్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మే 8 ప్రపంచ తలసీమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సిబార్ దంత వైద్య కళాశాలలో విద్య, వైద్యసేవలు అభినందనీయమన్నారు. దంత వైద్య పరిశోధన రంగంలో చూపిస్తున్న ప్రగతిని కొనియాడారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సిబార్ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులను ఆమె అభినందించారు. కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. ఉచిత దంత వైద్య శిబిరాలు, సామాజిక కార్యక్రమాల నిర్వహణలో సిబార్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ శిబిరంలో 125 మంది విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం దాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జాతీయ దంత వైద్య మండలి సభ్యురాలు డాక్టర్ పి.రేవతి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.రమణారెడ్డి, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక టీడీపీ నాయకులు గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంగళగిరి పట్టణంలోని 22వ వార్డుకు చెందిన గోలి అరుణకు రూ.2.54 లక్షలు.. సూర్యనారాయణ నగర్‌కు చెందిన చిట్టెమ్మకు రూ.81 వేలు.. మంగళగిరి మండల పరిధిలోని నవులూరు గ్రామానికి చెందిన లక్ష్మీ సుధకు రూ.1.50 లక్షలు.. కోటేశ్వరరావుకు రూ.1.30 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, నాయకులు షేక్ రియాజ్, గోవాడ దుర్గారావు, గుత్తికొండ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు గుంటూరుకు చెందిన మెడెక్స్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిబిరంలో 250 మంది విద్యార్థులకు ఉచిత పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. కొందరు విద్యార్థులకు లాసిక్, కంటి శుక్లాల సమస్యలు గుర్తించి వైద్య సలహాలు, మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీఎం డి.శ్రీనివాసరావు, మెడికల్ డైరెక్టర్ మాధవీలత, క్యాంపు కోఆర్డినేటర్ లక్కా నాగరాజు, వైద్య సిబ్బంది అనూష, రాజశేఖర్ కళాశాల కోఆర్డినేటర్లు టి.రాజు, జి.కిరణ్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

దుగ్గిరాల: విద్యుత్ మోటారుకి రుద్దుకుంటుంగా విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి చెందిన సంఘటన పేరుకలపూడిలో గురువారం చోటుచేసుకుంది. కుర్రా శివన్నారాయణకి చెందిన పశువులు పొలంలో మేత మేసి వస్తుండంగా గేదె షెడ్డు దగ్గర ఉన్న విద్యుత్ మోటారుకి బలంగా రుద్దుకుంది. దీంతో విద్యుత్ షాక్ తగలడంతో గేదె చనిపోయింది. గేదె విలువ సుమారు రూ.75 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

మాతృ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

మంగళగిరి: ఈనెల 11వ తేదీన మాతృ దినోత్సవం సందర్భంగా వీ వైబ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్ఫూర్తిదాయక కార్యక్రమాల్లో మహిళలంతా పాల్గొని విజయవంతం చేయాలని సంస్థ అధినేత రాగవీణ తెలిపారు. గురువారం మండలంలోని ఆత్మకూరు మిడ్ వ్యాలీ సిటీలో మహిళలను కార్యక్రమానికి ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. అదే రోజు సాయంత్రం ఎన్ఆర్ఐ ఆసుపత్రి జంక్షన్ నుంచి బస్టాండ్ వరకు 3కే రన్, శారీ వాక్ నిర్వహించనున్నట్లు రాఘవీణ తెలిపారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సత్కారం

తాడేపల్లి రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులను మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి సత్కరించారు. గురువారం తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయండి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న పల్లె కృష్ణ

తాడేపల్లి రూరల్: ఈనెల 20న నిర్వహించనున్న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని పారిశుధ్య కార్మికులను కలసి కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని అన్నారు. ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా సీఐటీయూ, వివిధ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు రాంబాబు, ప్రసాద్, కృష్ణ తులసి, రవి, తిరుపతిరావు, కోటేశ్వరి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: కార్మిక వర్గ చట్టాల రక్షణకు ఈనెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు తరలి రావాలని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్మిక విభాగ నియోజకవర్గ అధ్యక్షులు రత్నాకరం శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. గురువారం ప్రకాష్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు తుడిమెళ్ల వెంకటయ్య, ఏసీసీ నాయకులు స్టీవెన్ అధ్యక్షతన ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకుల కార్మిక సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు కాశయ్య, దుర్గారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టైలర్ షాపులో అగ్ని ప్రమాదం

రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన టైలర్ షాప్

మేడికొండూరు: షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి టైలర్ షాపు దగ్ధమైన సంఘటన మండలంలోని పేరేచర్లలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. షాపు యజమాని షేక్ జమీర్ ఉదయం షాపు తీసి మధ్యాహ్నం వరకు బట్టలు కుట్టాడు. అనంతరం షాప్ మూసివేసి భోజనానికి ఇంటికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి షాపులో దట్టమైన మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా అగ్నిమాపక శాఖ సిబ్బంది తమ వాహనంతో వచ్చి మంటలను అదుపు చేశారు. టైలర్ షాపులో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారులు గుర్తించారు. ప్రమాదంలో టైలర్ షాపులో నాలుగు అధునాతనమైన ఖరీదైన కుట్టు మిషన్లు, కస్టమర్లవి కొత్తగా ఇచ్చిన బట్టలు, కుట్టి పూర్తయిన తర్వాత డెలివరీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉంచినవి మొత్తం రూ.2 లక్షల వరకూ ఉంటాయని అన్నాడు. తన కుటుంబ జీవనోపాధి బతుకుదెరువు టైలరింగ్ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నానంటూ బాధితుడు వాపోయాడు.

కేఎల్‌యూలో ప్రారంభమైన ఇంజినీరింగ్ కౌన్సెలింగ్



జిగ్నేష్‌కు ధృవీకరణ పత్రాన్ని అందజేస్తున్న వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు

తాడేపల్లి రూరల్: కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం ప్రారంభించినట్లు ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్సిటీ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో 3వ ర్యాంక్ పొందిన ఆళ్ల వెంకట సాయి అఖిల్‌కు, క్రీడల విభాగంలో జిగ్నేష్‌కు సీఎస్ఈ విభాగంలో 50 శాతం ఫీజులో రాయితీ అందించినట్లు తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియ 11వ తేదీ వరకూ జరుగుతుందని.. కేఎల్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు పొందిన విద్యార్థులతో పాటు ఓపెన్ కేటగిరి కింద మెరిట్ విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చని పేర్కొన్నారు. జేఈఈలో అత్యుత్తమ శాతం పొందిన విద్యార్థులు కూడా మెరిట్ స్కాలర్‌షిప్ ద్వారా అడ్మిషన్స్ పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో కౌన్సెలింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ జగదీష్, కన్వీనర్ డాక్టర్ సుమన్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రావాల్సిన బకాయిలు చెల్లించాలి



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న దుర్గారావు, స్టీవెన్

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. గురువారం బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను ఆయన ప్రారంభించి మద్దతు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చట్టప్రకారం తమకు రావాల్సిన బకాయిలు మాత్రమే కార్మికులు అడుగుతున్నారని.. ప్రభుత్వం ఈ విషయం గమనించి యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కార్మికులు బి.దానయ్య, నవనీతం, శివకుమారి, గురవయ్య, సుబ్బారావు, సాంబయ్య, రమాదేవి, నాగేశ్వరరావు, అంకయ్య, రమణ, సారమ్మ, దుర్గాభవాని, యెహోషువా తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ఊరేగింపు మహోత్సవం



వాహనంలో ఊరేగిస్తున్న ధ్వజస్తంభం

యర్రబాలెం(మంగళగిరి): నగర పరిధిలోని యర్రబాలెంలో శ్రీ భక్తాంజనేయ స్వామి విగ్రహ, జీవధ్వజ, విమాన శిఖర ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం ధ్వజస్తంభ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాషాయ జెండాలతో నిర్వహించిన ద్విచక్రవాహన ర్యాలీ కనులపండువుగా సాగింది. స్వామివారి వేడుకలు 14న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్'పై సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

కాజ(మంగళగిరి): నగర పరిధిలోని కాజలో గురువారం బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. భారత్ సైనికులు పాకిస్థాన్ ఉగ్రవాదుల స్థావరాలపై చేసిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, దొడ్డక బ్రహ్మయ్య, కూరాకుల బాపయ్య, ఆర్ల వెంకయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: పహల్గాం ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుందని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీల సీనియర్ నాయకులు షేక్ సుభాని అన్నారు. దుగ్గిరాల ముర్తుజానగర్‌లో గురువారం ఆయన మాట్లాడారు. గత నెల 22న జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది అమాయక పర్యాటకుల ప్రాణాలు బలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ మనదేశంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నించిందని.. భారత సైన్యం తగిన వ్యూహంతో అర్ధరాత్రి మెరుపు దాడులు చేశాయని ఆయన పేర్కొన్నారు.